RNI NO:APTEL /2023/90201

# రాజధాని వాయిస్

తెలుగు దినపత్రిక

web : www.rajadhanivoice.in    rajadhanivoicedaily@gmail.com

విలేఖరులు కావలెను

రాజధాని వాయిస్ తెలుగు దినపత్రికలో కొనసాగుటకు గుంటూరు,పల్నాడు,జిల్లాలలో స్టాఫర్లు నియోజకవర్గాలకు ఇంచార్జులు మరియు మండలాల వారీగా విలేఖరులు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించగలరు.

9030343195

అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

సంపుటి : 02 | సంచిక : 308 | 29 మంగళవారం సెప్టెంబరు 2026 | ఎడిటర్ : పొగళ్ల పూర్ణచంద్రరావు | పేజీలు : 4 | వెల : రూ.1/-

## తాయ్‌మామన్ పథకానికి విజయ్ శ్రీకారం

- నవజాత శిశువులకు బంగారు ఉంగరాలు
- మదురైలో ఘనంగా పథకం ప్రారంభం
- తమిళ సంప్రదాయాలకు ప్రతీకగా కార్యక్రమం




**మదురై, రాజధాని వాయిస్** : తమిళనాడులో నవజాత శిశువుల సంక్షేమం, కుటుంబ విలువలకు ప్రాధాన్యం కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం "తాయ్‌మామన్ బంగారు ఉంగరం పథకం"ను ప్రారంభించి ంది. మదురై ప్రభుత్వ రాజాజీ ఆసుపత్రిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ పాల్గొని పథకాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో జన్మించిన శిశు వులకు బంగారు ఉంగరాలు తొడిగుతూ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో జన్మించిన పలువురు శిశువులను ముఖ్యమంత్రి స్వయంగా ఆశీర్వదించి బంగారు ఉంగరాలు తొడిగారు. శిశువు జననం ప్రతి కుటుంబానికి ఆనందోత్సవమని, ఆ ఆనందంలో ప్రభుత్వం కూడా భాగస్వామి కావాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో శిశువుల తల్లిదండ్రులు, వైద్యులు, ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.తమిళ సంస్కృతిలో తాయ్‌మామన్‌కు ప్రత్యేక స్థానం ఉందని ప్రభు త్వం పేర్కొంది. ప్రేమ, ఆప్యాయత, బాధ్యతలకు ప్రతీకగా భావించే ఈ సంప్రదాయాన్ని ప్రతిబింబిం చే విధంగా పథకాన్ని రూపొందించినట్లు వివరించింది. కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేయడం తో పాటు సంప్రదాయ విలువలను భావితరాలకు చేరవేయడం కూడా ఈ కార్యక్రమం లక్ష్యమని వెల్లడిం చింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించేందుకు ఈ పథకం దోహదపడుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. తల్లులు, శిశువులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజారోగ్య రంగంలో చేపడుతున్న సంస్కరణలకు ఇది మరో ముందడుగుగా పేర్కొన్నారు.కార్యక్రమానికి హాజరైన తల్లిదండ్రులు ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించారు. నవజాత శిశువుల జననాన్ని ప్రత్యేక సందర్భంగా గుర్తించి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. ఆసుపత్రి వాతావరణం పండుగను తలపించేలా మారిందని పేర్కొన్నారు. నవజాత శిశువుల పట్ల ప్రేమ, కుటుంబ బంధాల ప్రాధాన్యత, తమిళ సంస్కృతి గొప్పతనాన్ని ప్రతిబింబించే ఈ పథకం రాష్ట్రవ్యాప్తంగా అమలు కానుంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో జన్మించే ప్రతి శిశువుకు ఈ పథకం ద్వారా ప్రయోజనం కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజల నుంచి కూడా కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తున్నట్లు పేర్కొన్నారు.

# మంగళగిరి అభివృద్ధికి లోకేశ్ హామీ

**మంగళగిరి, రాజధాని వాయిస్** : మంగళగిరి నియోజకవర్గంలోని కుంచనపల్లిలో గల శ్రీ శ్రీనివాస కన్వెన్షన్‌లో సోమవారం నిర్వహించిన 'మన ఇల్లు -- మన లోకేశ్' మూడో విడత ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర విద్య, సమాచార సాంకేతిక శాఖ మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 372 మంది లబ్ధిదారులకు శాశ్వత ఇంటి పట్టాలు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన మంజూరు పత్రాలను అందజేశారు. సొంతింటి కలను సాకారం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పేద కుటుంబాలకు గృహ హక్కు కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. ఇంటి పట్టాల పంపిణీతో పాటు గృహ నిర్మాణానికి అవసరమైన సహాయ సహకారాలను కూడా ప్రభుత్వం అందిస్తోందని పేర్కొన్నారు.మంగళగిరిలో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని మంత్రి వెల్లడించారు. 2029 ఎన్నికల నాటికి ప్రతి ఇంటికి తాగునీటి కనెక్షన్, భూగర్భ గ్యాస్ కనెక్షన్, భూగర్భ మురుగు పారుదల వ్యవస్థను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు మెరుగైన పట్టణ వసతులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని చెప్పారు. ఆరోగ్య రంగంలోనూ కీలక చర్యలు చేపడుతున్నామని మంత్రి వివరించారు. వచ్చే ఏడాదిలో వంద పడకల ఆసుపత్రిని ప్రారంభించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించనున్నట్లు ప్రకటించారు. స్థానిక ప్రజలు వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అన్ని సౌకర్యాలతో ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.విద్యా రంగంలో మంగళగిరి ఆదర్శంగా నిలుస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల కోసం పోటీ పెరగడం విద్యా ప్రమాణాల మెరుగుదలకు నిదర్శనమని అన్నారు. నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రజల ఆశీస్సులు కూటమి అభ్యర్థులకు అందించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే దిశగా ప్రభుత్వం



ముందుకు సాగుతోందని, మంగళగిరిని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి కొనసాగుతుందని నారా లోకేశ్ స్పష్టం చేశారు.

# ఏనుగుల బెడదపై అప్రమత్తం

- అడవిలోకి మళ్లించేందుకు ప్రత్యేక చర్యలు
- కుంకీ ఏనుగులను రంగంలోకి దించాలని ఆదేశం
- ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత

**చిత్తూరు, రాజధాని వాయిస్** : చిత్తూరు జిల్లాలోని పలు గ్రామాల్లో సంచరిస్తూ ప్రజలు, రైతుల్లో భయాందోళనలు కలిగిస్తున్న ఏనుగుల గుంపును వెంటనే సురక్షితంగా అడవిలోకి మళ్లించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం అటవీ శాఖ ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించి పరిస్థితిని సమగ్రంగా పరిశీలించారు. గత పదిహేను రోజులుగా 11 ఏనుగులతో కూడిన గుంపు, దాని నుంచి విడిపోయిన మరో రెండు ఏనుగులు పడిపుట్లబైలు పంచాయతీ పరిధిలోని పుండ్లవల్లపల్లి, నడింపల్లి, కొండకిందపల్లి గ్రామాల్లో సంచరిస్తున్నట్లు అధికారులు వివరించారు. ఈ కారణంగా స్థానిక ప్రజలు భయాందోళనలకు గురవుతుండగా, రైతులు తమ పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం ఒక ఏనుగుల గుంపు రహదారి దాటి మంగళంపేట బీట్ పరిధిలోకి ప్రవేశించినట్లు, మరో రెండు ఏనుగులు చిత్తూరు వైపు కదులుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కదలికల నేపథ్యంలో పాకాల, పులిచెర్ల, చంద్రగిరి మండలాల ప్రజలకు ముప్పు పొంచి ఉండే అవకాశం ఉందని అటవీ శాఖ అంచనా వేస్తోంది. దీంతో ముందస్తు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. మానవ--ఏనుగు ఘర్షణలు చోటుచేసుకోకుండా క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ఏనుగుల కదలికలపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి గ్రామస్తులను అప్రమత్తం చేయాలని ఆదేశించారు.ఏనుగులను సురక్షితంగా అడవిలోకి మళ్లించేందుకు ముసలమడుగు శిబిరం నుంచి కుంకీ ఏనుగులను రంగంలోకి దించాలని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అటవీ, పోలీసు, రెవెన్యూ, విద్యుత్ శాఖలతో పాటు ప్రత్యేక బృందాలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రమాద ప్రాంతాల్లో రాత్రింబవళ్లు నిఘా కొనసాగించాలని ఆదేశించారు. ఏనుగుల దాడులతో పంటలు నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి హాని కలగకుండా చూడటంతో పాటు వన్యప్రాణుల సంరక్షణకు



కూడా ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రజల భద్రత, పంటల పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ అనే మూడు అంశాలను సమన్వయం చేస్తూ చర్యలు కొనసాగించాలని ఆయన స్పష్టం చేశారు.

# వాయుగుండం దెబ్బకు రోడ్ల నష్టం



**అమరావతి, రాజధాని వాయిస్** : తీవ్ర వాయుగుండం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారులన్నింటినీ త్వరలోనే పునరుద్ధరిస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. భారీ వర్షాల సమయంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అన్ని రకాల ముందస్తు, సహాయక చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. వర్షాల ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయని మంత్రి వెల్లడించారు. ఆర్ అండ్ బీ శాఖ పరిధిలో మొత్తం 2405 కిలోమీటర్ల మేర రహదారులు నష్టపోయినట్లు ప్రాథమిక అంచనాలు వెల్లడించాయని చెప్పారు. ఈ నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.దెబ్బతిన్న రహదారుల పునరుద్ధరణ కోసం సుమారు రూ.1,498.30 కోట్ల వ్యయంతో ప్రాథమిక ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు మంత్రి వెల్లడించారు. రవాణా వ్యవస్థ సాధారణ స్థితికి చేరుకునేలా అత్యవసర మరమ్మతు పనులను ప్రాధాన్య క్రమంలో చేపడతామని పేర్కొన్నారు. ప్రజల రాకపోకలకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విపత్తు సమయంలో ఆర్ అండ్ బీ శాఖ అధికారులు, ఇంజినీర్లతో నిరంతరం సమీక్షలు నిర్వహించినట్లు మంత్రి చెప్పారు. క్షేత్రస్థాయి యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి దెబ్బతిన్న ప్రాంతాల్లో వెంటనే స్పందించేలా ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. వర్షాల వల్ల ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రహదారుల పునరుద్ధరణకు అవసరమైన నిధులు, సాంకేతిక సహకారం అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. వర్షాల ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. దెబ్బతిన్న రహదారులన్నింటినీ దశలవారీగా పునరుద్ధరించి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని బీసీ జనార్ధన్ రెడ్డి స్పష్టం చేశారు. రహదారుల మరమ్మతు పనులు పూర్తయిన అనంతరం ప్రయాణికులకు మరింత సురక్షితమైన, సౌకర్యవంతమైన రవాణా వ్యవస్థ అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

## పింఛనుదారులకు గుడ్ న్యూస్.. 1వ తేదీ ఉదయం నుంచే పింఛన్ల పంపిణీ



**అమరావతి, రాజధాని వాయిస్** : రాష్ట్రంలోని ఎన్టీఆర్ భరోసా పింఛనుదారులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. గతంలో ప్రకటించినట్టుగా సవరించిన వేళలతో సంబంధం లేకుండా, ఎప్పటిలాగే అక్టోబర్ 1వ తేదీ ఉదయం 6:30 గంటల నుంచే లబ్ధిదారుల ఇంటి వద్దే పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకు ఉద్యోగులు తమ సమ్మెను విరమించడంతో బ్యాంకింగ్ కార్యకలా పాలకు ఎలాంటి ఇబ్బంది లేకపోవడంతో ముందస్తు ప్రణాళిక ప్రకారమే పింఛన్ల పంపిణీకి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మంత్రి వెల్లడించారు. సెప్టెంబర్ 30వ తేదీనే స్వర్ణ గ్రామం / స్వర్ణ వార్డు సిబ్బంది బ్యాంకుల నుంచి 100% పింఛను నగదును విత్‌డ్రా చేసుకుని.. అక్టోబర్ 1వ తేదీ ఉదయం నుంచే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ల నగదు అందజేస్తారని తెలిపారు. అక్టోబర్ నెలకు గాను ప్రభుత్వం ఇప్పటికే రూ.2,692.34 కోట్లను విడుదల చేసిందని.. ఇందులో రూ.2,692.28 కోట్లను పంచాయతీ / వార్డుల ఖాతాలకు జమ చేయగా, రూ. 6 లక్షలను గజపతినగరం మండలంలోని చీపురా పింఛనుదారుల ఖాతాలకు డీబీటీ ద్వారా జమ చేస్తారని మంత్రి పేర్కొన్నారు. ఈ నెల 30 నాటికి అవసరమైన నగదు సిద్ధంగా ఉండేలా జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్లు (PDs), ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు, గ్రామ/వార్డు సచివాలయాల మరియు బ్యాంకర్లతో సమన్వయం చేసుకోవాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్రంలోని 61.80 లక్షల మంది పింఛనుదారులకు ప్రతి నెలా 1వ తేదీనే సకాలంలో పింఛన్లు అందించే బాధ్యత ప్రభుత్వం తీసుకుందని మంత్రి కొండపల్లి స్పష్టం చేశారు.

# బీసీ సంక్షేమానికి పెద్దపీట: భట్టి

**హైదరాబాద్, రాజధాని వాయిస్** : రాష్ట్రంలో బీసీ సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. సోమవారం ప్రజాభవన్‌లో నిర్వహించిన బీసీ సంక్షేమ శాఖ ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రీ-మెట్రిక్, పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను నేరుగా విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఇప్పటివరకు 1.30 లక్షల మంది విద్యార్థులకు రూ.450 కోట్ల నిధులను నేరుగా ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. హాస్టల్ విద్యార్థుల ఆహార, ఇతర భత్యాలను కూడా ప్రతి నెలా సకాలంలో జమ చేయాలని అధికారులను ఆదేశించారు.గీత కార్మికుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న "కాటమయ్య రక్షణ కవచాలు" పథకం కింద 50 వేల మందికి రక్షణ కిట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే 40 వేల కిట్లను పంపిణీ చేశామని, శిక్షణ పొందుతున్న మరో 10 వేల మందికి కూడా త్వరలోనే అందజేస్తామని చెప్పారు. ఈ పథకం కోసం ప్రభుత్వం రూ.60 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. బీసీ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో రూపొందించిన "రాజీవ్ యువ వికాసం" పథకాన్ని నవంబర్ నెల నుంచి ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే వచ్చిన దరఖాస్తులను పారదర్శకంగా పరిశీలించి అర్హులను ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్లకు సూచించినట్లు తెలిపారు.మహాత్మా జ్యోతిబా పూలే గురుకులాల్లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను త్వరలోనే విడుదల చేస్తామని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. గురుకుల విద్యాలయాలకు స్వంత భవనాల నిర్మాణంపై కూడా ప్రభుత్వం సానుకూలంగా ఉందని పేర్కొన్నారు. ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం కింద 180 మంది విద్యార్థులకు ఇప్పటికే రూ.18.40 కోట్ల నిధులను విడుదల చేసినట్లు తెలిపారు. మరింత మంది అర్హులకు అవకాశం కల్పించేందుకు దరఖాస్తుల గడువును అక్టోబర్ 15 వరకు పొడిగించినట్లు వెల్లడించారు. అలాగే బీసీ కుల సంఘాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి అవసరమైన నిధులను కూడా త్వరలో విడుదల చేస్తామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.



## పేదల గుండెకు ప్రభుత్వ భరోసా: మంత్రి సత్యకుమార్ యాదవ్



**అమరావతి, రాజధాని వాయిస్** పేదల గుండెకు ప్రభు త్వం మరింత భరోసా కల్పి స్తోందని ఏపీ ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. త్వరలో కాకినాడ జీజీహెచ్‌తో పాటు తిరుపతి, నెల్లూరు, శ్రీకాకు ళంలోనూ క్యాథ్‌ల్యాబ్ సేవలు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. గుండె వైద్యపరికరాల కోసం రూ.34 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

## విశాఖ రైల్వే స్టేషన్‌లో ఘనంగా 'స్టేషన్ మహోత్సవ్ 2026'

**విశాఖపట్నం,రాజధాని వాయిస్ సెప్టెంబరు 28:** విశాఖపట్నం రైల్వే స్టేషన్ ఆవిర్భవించి 130 ఏళ్లు గడిచిన సందర్భంగా సోమవారం 'స్టేషన్ మహోత్సవ్' నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా దక్షిణ కోస్తా రైల్వే జీఎం సందీప్ మాథుర్ విచ్చేశారు. అలాగే విశాఖ డివిజన్ డీఆర్‌ఎమ్ లలిత్ బోహ్రాతో పాటు పలువురు రైల్వే అధికారులు కూడా ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది రైల్వే స్టేషన్‌లో ఫ్లాగ్ మార్చ్ చేశారు. స్టేషన్ మహోత్సవ్‌లో భాగంగా వాల్తేరు డివిజన్, విశాఖ స్టేషన్ చరిత్రను తెలిపే అరుదైన ఫోటో ఎగ్జిబిషన్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. రైల్వే వారసత్వాన్ని వివరించే వస్తువులను ప్రదర్శించారు. దశాబ్దాలుగా విశాఖ స్టేషన్ రూపాంతరం, మైలురాళ్లు, చారిత్రక కథనాలను పొందు పరుస్తూ ఓ కాఫీ టేబుల్ బుక్‌ను రూపొందించారు. దీన్ని సందీప్ మాథుర్, లలిత్ బోహ్రా ఆవిష్కరించారు. ఆ తరువాత విశాఖ రైల్వే స్టేషన్ 130 ఏళ్ల ప్రస్థానాన్ని గుర్తుచేసేలా సిబ్బంది హీలియం బెలూన్ ప్రదర్శనను ఏర్పాటు చేశారు. అలాగే రైల్వే చరిత్ర, విశిష్టతను చాటిచెప్పేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

**విశాఖ రైల్వే స్టేషన్‌కు ఎంతో చరిత్ర ఉంది: జీఎం సందీప్ మాథుర్**

అనంతరం దక్షిణ కోస్తా రైల్వే జీఎం సందీప్ మాథుర్ మాట్లాడు తూ.. విశాఖ రైల్వే స్టేషన్‌కు ఎంతో చరిత్ర ఉందని అన్నారు. '130 ఏళ్ల క్రితం విశాఖ రైల్వే స్టేషన్ ప్రారంభం అయింది. రెండు ప్లాట్ ఫారంలతో మొదలైన విశాఖ రైల్వే స్టేషన్‌లో ఇప్పుడు ఎనిమిది ప్లాట్ ఫారంలు ఉన్నాయి. త్వరలో ఈ సంఖ్య 14కు పెరుగుతుంది. ఇప్పటికే పనులు జరుగుతున్నాయి' అని ఆయన పేర్కొన్నారు. ఈ 130 ఏళ్ల ప్రయాణానికి అద్దం పట్టేలా ప్రదర్శనలు నిర్వహించినందుకు సిబ్బందిని అభినందించారు.

## ఆక్వా రైతులకు విద్యుత్ భరోసా.. రూ.55 కోట్లతో సబ్‌స్టేషన్ ప్రారంభించిన మంత్రి గొట్టిపాటి

పశ్చిమ గోదావరి **రాజధాని వాయిస్** : ఆక్వా రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం విద్యుత్ మౌలిక వసతులను బలోపేతం చేస్తోందని ఏపీ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా గోపవరంలో రూ.55 కోట్లతో నిర్మించిన 220/33 కేవీ సబ్‌స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీ డిప్యూటీ సీఎం రఘురామకృష్ణంరాజు, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఆక్వా రైతులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ అందించేందుకు ఈ సబ్‌స్టేషన్‌ను నిర్మించినట్లు మంత్రి గొట్టిపాటి తెలిపారు. ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్‌ను కేవలం రూ.1.50కే సబ్సిడీపై అందిస్తున్నామని చెప్పారు. రాయితీపై విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం రూ.1,200 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. జోన్లతో సంబంధం లేకుండా ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీ అందిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా రూ.6 వేల కోట్లతో సబ్‌స్టేషన్ల నిర్మాణం జరుగుతోందని మంత్రి గొట్టిపాటి తెలిపారు. విద్యుత్ డిమాండ్ పెరిగిన నేపథ్యంలో అందుకు అనుగుణంగా ఉత్పత్తిని పెంచామని చెప్పుకొచ్చారు. పీక్ అవర్స్‌లో అవసరమైతే తక్కువ ధరకే బహిరంగ మార్కెట్ నుంచి విద్యుత్ కొనుగోలు చేస్తున్నామని వివరించారు. ఆక్వా రైతులకు నిరంతర సరఫరా నిలిపివేసే ప్రసక్తే లేదని మంత్రి స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగిందని, అయినప్పటికీ డిమాండ్‌కు తగినట్లుగా సరఫరా కోసం చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ రంగం వెనుకబడిందని విమర్శించారు. గతంలో ప్రతి ఆరు నెలలకు ఏదో ఒక రూపంలో ఛార్జీలు పెంచారని ఆరోపించారు. తమ ప్రభుత్వం మాత్రం విద్యుత్ ఛార్జీలు పెంచకుండా ట్రూ డౌన్ చేశామని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు.

## విజయవాడ దసరాకు 25 లక్షల మంది భక్తులు.. ఏఐతో నిఘా: మంత్రి సత్యకుమార్

**విజయవాడ, రాజధాని వాయిస్ :** దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఈఏడాది 25 లక్షల మంది భక్తులు విజయవాడ కనకదుర్గ మ్మను దర్శించుకుంటారని అంచనా వేస్తున్నట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. సోమవారం దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల 4వ సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భక్తులకు అసౌకర్యం కలగకుండా దసరా ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. ప్రతీరోజూ సగటున 2 లక్షల భక్తులు దుర్గగుడికి వస్తారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. వెయిటింగ్ ఏరియాల్లో ఎల్‌ఈడీ స్క్రీన్‌లలో ఆధ్యాత్మిక కార్యక్రమాలను వీక్షించచ్చని.. లడ్డూ ప్రసాదం విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని నిర్ణయించామని తెలిపారు. త్రాగునీరు, వేడిపాలు, బిస్కెట్లు, ఆహార పదార్థాలు ఉంటాయన్నారు. వైద్య సిబ్బందిని ప్రతిచోటా ఏర్పాటు చేస్తామని చెప్పారు. దసరాతో పాటుగా సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని దర్శించుకునేందుకు పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు వస్తారని మంత్రి తెలిపారు. ఏఐ ఆధారిత నిఘా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. క్యూలైన్లలో వెయిటింగ్ తగ్గించడం, భక్తులకు మార్గాలు తెలిసేలా ప్రాచుర్యం చేస్తామని తెలిపారు. ప్రసాదం ఏటీఎంల ఏర్పాటు విషయంలోనూ నిర్ణయం తీసుకుంటున్నామని అన్నారు. ఖడ్గమాలార్చన, శ్రీచక్ర నవార్చన మొదలైన ఆర్జిత సేవల టికెట్లు ఆన్‌లైన్లో, వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పొందవచ్చని తెలిపారు. పరోక్ష సేవలకు కూడా టికెట్లు ఉంటాయని.. నగరోత్సవం కూడా ఉంటుందని చెప్పారు. ఆధునిక ప్రసాదాల తయారీ కూడా ఉంటుందన్నారు. జీపీఎస్ ఆధారిత పారిశుధ్య పర్యవేక్షణ ఉంటుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

**ప్రతి వాహనాన్ని పర్యవేక్షిస్తాం: సీపీ రాజశేఖర్ బాబు**

ఈసారి కొండచరియల వల్ల ఘాట్‌రోడ్డు మూసుకుపోతే మహామండపంలో ఐదు అంతస్తుల నుంచి క్యూలైన్లు వదులుతామని సీపీ రాజశేఖర్ బాబు తెలిపారు. ఇది ప్రయోగాత్మకంగా చేసే పనిగా చెప్పుకొచ్చారు. ప్రతి వాహనం ఎన్నిసార్లు కొండమీదకు వచ్చిందనేది పర్యవేక్షణ ఉంటుందన్నారు. గతం కంటే తక్కువ మంది పోలీసులుంటారని సీపీ రాజశేఖర్ బాబు వెల్లడించారు.

# వాల్మీకిపురం ఆలయానికి రూ.5.73 కోట్లు

**- అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన బీఆర్ నాయుడు - పుష్కరిణి, రాజగోపురం పునర్నిర్మాణానికి ప్రాధాన్యం - భక్తులకు మెరుగైన సౌకర్యాలే లక్ష్యం - సనాతన ధర్మ పరిరక్షణకు టీటీడీ కృషి**





**వాల్మీకిపురం, రాజధాని వాయిస్ :** అన్నమయ్య జిల్లా వాల్మీకి పురంలోని శ్రీ పట్టాభిరామస్వామి ఆలయ అభివృద్ధికి రూ.5.73 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ బీఆర్ నాయుడు శంకుస్థాపన చేశారు. ఆలయానికి మరింత ఆధ్యాత్మిక వైభవం తీసుకురావడంతో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ఈ పనుల ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ నాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో సనాతన ధర్మ పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. పురాతన ఆలయాల పునరుద్ధరణ, నూతన ఆలయాల నిర్మాణం ద్వారా ఆధ్యాత్మిక వారసత్వాన్ని భావితరాలకు అందించేందుకు టీటీడీ కృషి చేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలు విశేష ఫలితాలు ఇస్తున్నాయని పేర్కొన్నారు. వాల్మీకిపురం ఆలయంలో పుష్కరిణి అభివృద్ధి, కళ్యాణ వేదిక మండపం నిర్మాణం, రాజగోపురం పునర్నిర్మాణం, ప్రధాన ప్రవేశ ఆర్చ్ నిర్మాణం, కళ్యాణ మండపం రెండో అంతస్తు నిర్మాణం, పార్వేట మండపం అభివృద్ధి వంటి పలు పనులను ఈ నిధులతో చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పనులు పూర్తయితే ఆలయానికి మరింత శోభ చేకూరడంతో పాటు భక్తులకు సౌకర్యాలు పెరుగుతాయని వివరించారు. ఆలయానికి చేరుకున్న బీఆర్ నాయుడు శ్రీ పట్టాభిరామస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందించగా, ఆలయ చరిత్ర, అభివృద్ధి అవసరాలపై ఆయనకు వివరించారు. ఆలయ అభివృద్ధి పనులు నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. టీటీడీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఐదు వేల ఆలయాల అభివృద్ధి లక్ష్యంగా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని బీఆర్ నాయుడు తెలిపారు. ఇప్పటికే వెయ్యికి పైగా ఆలయాల్లో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లోని పురాతన దేవాలయాలను సంరక్షించడం ద్వారా ఆధ్యాత్మిక సంపదను కాపాడాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. భక్తులకు మెరుగైన ఆధ్యాత్మిక వాతావరణం కల్పించడంతో పాటు ఆలయాల అభివృద్ధి ద్వారా ధార్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించడమే టీటీడీ లక్ష్యమని బీఆర్ నాయుడు పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఆలయాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి భక్తులకు సౌకర్యాలను విస్తరించనున్నట్లు తెలిపారు. వాల్మీకిపురం ఆలయం అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత ఈ ప్రాంతం ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా మరింత గుర్తింపు పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# టీడీపీలో చేరిన మంగళగిరి నియోజకవర్గ వైసీపీ నేతలు




ఉండవల్లి:, **రాజధాని వాయిస్** స్థానిక ఎన్నికల వేళ మంగళగిరి నియోజకవ ర్గంలో వైసీపీకి షాక్ తగిలింది. విద్య, ఐటీ శాఖల మంత్రి, మంగళగిరి నియోజకవర్గ శాసనసభ్యులు నారా లోకేష్ సమక్షంలో మంగళగిరి, తాడేపల్లి, ఉండవల్లి మండలాలకు చెందిన పలువురు సీనియర్ వైసీపీ నేతలు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. మంగళగిరి పట్టణానికి చెందిన మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్, పట్టణ వైసీపీ మాజీ అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, ఆయన సతీమణి, మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ మంత్రి లోకేష్ సమక్షంలో టీడీపీలో చేరారు. తాడేపల్లి రూరల్ ఉండవల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ కళ్లం సంజీవ్ రెడ్డి, కళ్లం సాంబిరెడ్డి, కళ్లం శ్రీనివాసరెడ్డితో పాటు ఆరు కుటుంబాలు, తాడేపల్లి పట్టణానికి చెందిన సీనియర్ వైసీపీ నేత, దుర్గగుడి ట్రస్ట్ బోర్డు మాజీ ప్రత్యేక ఆహ్వానితులు, స్టేడ్ రెడ్డి కార్పోరేషన్ మాజీ డైరెక్టర్ జక్కిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సూరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సూరెడ్డి శ్రీనివాసరెడ్డి, కొల్లి లక్ష్మారెడ్డి, బొమ్మి కోటిరెడ్డితో పాటు నాలుగు కుటుంబాలు, తాడేపల్లి పట్టణానికి చెందిన వైసీపీ నేత దొంతిరెడ్డి వినయ్ కుమార్ రెడ్డితో పాటు రెండు కుటుంబాలు, మంగళగిరి రూరల్ నిడమర్రుకు చెందిన వైసీపీ సీనియర్ నేత కట్టెపోగు బాబురావుతో పాటు 6 కుటుంబాలు, మంగళగిరి రూరల్ యర్రబాలెంకు చెందిన గుంటూరు బ్రాహ్మణ సంఘం కార్యదర్శి వేమవరపు నారాయణతో పాటు ఐదు కుటుంబాలు తెలుగుదేశంలో చేరారు. ఉండవల్లి నివాసంలో వీరందరికీ పసుపు కండువాలు కప్పి మంత్రి లోకేష్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

**అందరం మంగళగిరి అభివృద్ధిలో భాగస్వాములం అవుదాం**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మీరంతా తెలుగుదేశం పార్టీలో చేరడం చాలా సంతోషంగా ఉంది. ఎన్నికల ముందు, తర్వాత నాది ఒక్కటే నినాదం.. మంగళగిరి అభివృద్ధి. మంచి మెజార్టీతో నన్ను గెలిపిస్తే దేశంలోనే మంగళగిరి నియోజకవర్గాన్ని నెం.1 తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చా. ప్రస్తుతం ఏపీ చూపు మంగళగిరి వైపు ఉంది. అందరం మంగళగిరి అభివృద్ధిలో భాగస్వాములం అవుదాం. ఆసుపత్రి నుంచి స్మశానాల వరకు మంగళగిరిని అభివృద్ధి చేస్తున్నాం. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వాటర్, గ్యాస్ అందిస్తాం. రెండేళ్లలోనే అన్ని పనులు పూర్తిచేస్తాం. కలిసికట్టుగా మంగళగిరిని అభివృద్ధి చేసుకుందాం. మనందరం ఒక కుటుంబం లాంటివాళ్లం. నమ్మితే నేను ఏదైనా చేస్తా.

మంగళగిరి ప్రజలు నన్ను గుండెల్లో పెటుకుని చూసుకున్నారు. 91వేల మెజార్టీతో గెలిపించారు. మనపై బాధ్యత పెరిగింది. తప్పులు చేయకూడదు. మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటా. వారికి ఏ కష్టం వచ్చినా చూసుకుంటా. మూడొందలు, నాలుగొందల ఏళ్ల తర్వాత మంగళగిరిని అప్పట్లో నారా లోకేష్ అభివృద్ధి చేశారని ప్రజలు చెప్పుకుంటే చాలు. అందుకోసం నిరంతరం కష్టపడుతున్నా. నాడు, నేడు, ఎప్పుడూ మంగళగిరికే నా ప్రథమ ప్రాధాన్యత. సమస్యలు ఏవైనా ఉంటే కలిసి పరిష్కరించుకుందాం. ఒక్కసారి నిర్ణయం తీసుకున్న తర్వాత అందరూ తూచా తప్పకుండా పాటించాలని మంత్రి లోకేష్ చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయ్, పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకి దేవి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల జయసత్య, మంగళగిరి నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, మంగళగిరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు పడవల మహేష్, మండల పార్టీ అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, తాడేపల్లి పట్టణ టీడీపీ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు, రూరల్ అధ్యక్షుడు దాసరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మైనర్‌పై అత్యాచారం.. సుమోటోగా తీసుకున్న సుప్రీం

**న్యూఢిల్లీ, రాజధాని వాయిస్ :** ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో కదులుతున్న బస్సులో మైనర్ బాలికపై జరిగిన సామూహిక అత్యాచారం ఘటనను సుప్రీంకోర్టు సోమవారం సుమోటోగా స్వీకరించింది. ఈ సందర్భంగా అత్యాచార ఘటనల పునరావృతిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన సర్వోన్నత న్యాయస్థానం, ఇటువంటి సంఘటనలు శాంతిభద్రతల నిర్వహణలో వ్యవస్థాగత వైఫల్యాన్ని ప్రతిబింబిస్తున్నాయని పేర్కొంది. జస్టిస్ జె.బి. పార్దివాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారిస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. 2012లో దేశాన్ని కుదిపేసిన నిర్భయ ఘటనతో ఈ కేసుకు పోలికలు ఉన్నాయని అభిప్రాయపడింది. దశాబ్దానికి పైగా గడిచినప్పటికీ మహిళల భద్రత విషయంలో చట్ట అమలు వ్యవస్థలు ఎంత మేరకు పురోగతి సాధించాయనే ప్రశ్న తలెత్తుతోందని పేర్కొంది. దేశ రాజధాని ప్రాంతంలో వరుసగా వెలుగుచూస్తున్న లైంగిక నేరాల ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని ధర్మాసనం తెలిపింది. ప్రజల భద్రతను కాపాడాల్సిన బాధ్యత ఉన్న వ్యవస్థలు సమర్థంగా పనిచేయకపోతే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతాయని వ్యాఖ్యానించింది. శాంతిభద్రతల పరిరక్షణలో అధికారుల పాత్ర మరింత బాధ్యతాయుతంగా ఉండాలని సూచించింది. అత్యాచార ఘటనల అనంతరం ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు చేసే సంఘీభావ ప్రకటనలు మాత్రమే సరిపోవని సుప్రీంకోర్టు పేర్కొంది. బాధితుల పట్ల సానుభూతి వ్యక్తం చేయడం అవసరమే అయినప్పటికీ, నేరాలను అరికట్టే దిశగా సమర్థవంతమైన చర్యలు, జవాబుదారీతనం కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేసింది. రోడ్లు, పార్కులు, బస్సులు, మెట్రో స్టేషన్లు, సబ్‌వేలు, పాదచారుల వంతెనలు వంటి ప్రజా ప్రదేశాల్లో తగిన నిఘా, వెలుతురు, భద్రతా ఏర్పాట్లు లేకపోవడం ఆందోళనకరమని ధర్మాసనం పేర్కొంది. పరిపాలనా లోపాల కారణంగా ప్రజా ప్రదేశాలు ప్రమాదకర ప్రాంతాలుగా మారకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించింది. భయం లేకుండా, గౌరవంగా జీవించే హక్కు రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద కల్పించిన ప్రాథమిక హక్కులో భాగమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. మహిళలు, బాలికల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని, నేరాల నివారణకు కఠిన చర్యలు, సమర్థవంతమైన అమలు వ్యవస్థలు అవసరమని ధర్మాసనం పేర్కొంది.

## దేశవ్యాప్త బంగారం అక్రమ రవాణా ముఠా గుట్టురట్టు



**న్యూఢిల్లీ, రాజధాని వాయిస్ :** రెవెన్యూ ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్ అధికారులు దేశవ్యాప్తంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న భారీ బంగారం అక్రమ రవాణా ముఠాను ఛేదించారు. ఈ చర్యల్లో భాగంగా సుమారు 6.6 కిలోల విదేశీ మూలాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసిన బంగారం విలువ రూ.10 కోట్లకు పైగా ఉంటుందని అధికారులు వెల్లడించారు. ఈ కేసులో ముఠా సూత్రధారితో పాటు మొత్తం 11 మందిని అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. దేశంలోని పలు ప్రాంతాల్లో సమన్వయంతో నిర్వహించిన దాడుల ద్వారా అక్రమ రవాణా నెట్‌వర్క్ కార్యకలాపాలను వెలుగులోకి తీసుకొచ్చారు. అరెస్టు చేసిన వారి నుంచి కీలక సమాచారం సేకరిస్తున్నట్లు వెల్లడించారు. ప్రాథమిక దర్యాప్తులో ఈ ముఠా కొరియర్ మార్గాలను వినియోగించి విదేశీ బంగారాన్ని దేశంలోకి అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. గత తొమ్మిది నెలల కాలంలో సుమారు 318 కిలోల అక్రమ బంగారాన్ని దేశంలోని వివిధ ప్రాంతాలకు తరలించినట్లు విచారణలో తేలింది. అక్రమంగా రవాణా చేసిన బంగారం విలువ సుమారు రూ.475 కోట్ల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. బంగారం సరఫరా, పంపిణీ కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసి దేశవ్యాప్తంగా కార్యకలాపాలు నిర్వహించినట్లు దర్యాప్తులో బయటపడింది. ఈ వ్యవహారంలో పాల్గొన్న ఇతర వ్యక్తులు, సంబంధిత నెట్‌వర్క్‌లపై కూడా విచారణ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ఆర్థిక నేరాలకు అడ్డుకట్ట వేయడానికి కేంద్ర సంస్థలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. దేశంలో బంగారం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపేందుకు చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు స్పష్టం చేశారు. ఈ కేసుకు సంబంధించిన మరిన్ని వివరాలను దర్యాప్తు పూర్తైన తర్వాత వెల్లడిస్తామని తెలిపారు.

[redacted]

# ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు ముమ్మరం

- సభా స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ
- త్రిమితీయ సాంకేతికతతో గృహ నిర్మాణ కార్యక్రమం
- నంబూరులో వేదిక ఏర్పాట్లపై అధికారుల సమీక్ష





**గుంటూరు,రాజధాని వాయిస్ సెప్టెంబర్ 28 :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 4వ తేదీన గుంటూరు జిల్లాలో నిర్వహించనున్న కార్యక్రమానికి సంబంధించి అధికారులు ఏర్పాట్లను వేగవంతం చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్--2.0 పథకంలో భాగంగా త్రిమితీయ సాంకేతికతతో గృహ నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ, జిల్లా పోలీసు సూపరింటెండెం ట్ వకుల్ జిందాల్‌తో కలిసి ప్రతిపాదిత సభా స్థలాన్ని పరిశీలిం చారు. మొదట ఈ కార్యక్రమాన్ని తెనాలి మండలం బుర్రిపాలెంలో నిర్వహించాలని ప్రతిపాదించినప్పటికీ, ప్రస్తుతం పెదకాకాని మండలం నంబూరు గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహించే అవకాశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ మేరకు నంబూరు ప్రాంతంలోని పలు ప్రదేశాలను సందర్శించి సభా స్థలం, వేదిక ఏర్పాటు, ప్రజల రాకపోకలు, పార్కింగ్ సౌకర్యాలు తదితర అంశా లపై సమీక్ష నిర్వహించారు.దశావతార దేవాలయం సమీపంలోని స్థలంతో పాటు ఇతర అనువైన ప్రదేశాలను కూడా అధికారులు పరిశీలించారు. సభ నిర్వహణకు అవసరమైన విస్తీర్ణం, భద్రతా ప్రమాణాలు, రవాణా సౌకర్యాలు, ప్రజల సామర్థ్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని తుది నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా భద్రతా ఏర్పాట్లపై జిల్లా పోలీసు యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. సభా ప్రాంగణం, వేదిక పరిసర ప్రాంతాలు, వాహనాల పార్కింగ్ ప్రాంతాలు, ప్రజల ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను పరిశీలించి అవసరమైన సూచనలు చేసింది. భద్రతకు ఎలాంటి విఘాతం కలగకుండా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు.అదేవిధంగా తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, రహదారి సౌకర్యాలు తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు సమీక్ష నిర్వహించారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గృహ నిర్మాణ కార్యక్రమం రాష్ట్రంలో సాంకేతిక వినియోగానికి కొత్త దిశగా నిలుస్తుందని అధికారులు పేర్కొన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి కె. శ్రీనివాసరావు, డీఎస్పీ సి.హెచ్. మురళీకృష్ణ, రహదారులు--భవనాల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ ఆర్. శ్రీనివాసమూర్తి, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె. కళ్యాణ చక్రవర్తి, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగసాయికుమార్, గృహ నిర్మాణ సంస్థ అధికారులు, తహసీల్దార్ ఫణి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని అధికారులు తెలిపారు.

# నైపుణ్యాలతోనే ఉజ్వల భవిష్యత్తు: ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు, రాజధాని వాయిస్ సెప్టెంబర్ 28 :** రాష్ట్రంలో యువత భవితకు భరోసా కల్పించాలనే మహా సంకల్పంతో కూటమి ప్రభుత్వం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ తెలిపారు.యువత భవితకు భరోసా కార్యక్రమాన్ని స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాలలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో ఇంటికో పారిశ్రామిక వేత్తను తయారు చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. కేవలం అకడమిక్ విద్య మాత్రమే కాకుండా ప్రతి విద్యార్థిలోను కమ్యూనికేషన్ స్కిల్స్ డెవలప్ చేసేలా శిక్షణ తరగతులు అందిస్తున్నట్లు చెప్పారు.కూటమి ప్రభుత్వంలో ఎంతో పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించామని, 16 వేలకుపైగా ఉద్యోగాలు నిరుద్యోగులకు కల్పించామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో పారిశ్రామిక విప్లవానికి నాంది పలికినట్లు చెప్పారు.తద్వారా లక్షల ఉద్యోగాలు రానున్నాయని, విద్యార్థులు తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలని సూచించారు. గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాలలో తాము అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. కళాశాలలో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఈ సందర్భంగా భరోసా కల్పించారు.

# బయో వ్యర్థాలను వేరు చేయాలి: గుంటూరు సీఎంఓహెచ్ ఆదేశం




**గుంటూరు, సెప్టెంబర్ 28రాజధాని వాయిస్ :** హాస్పిటల్స్ అండ్ డయోగ్నిస్టిక్ సెంటర్ల నిర్వాహకులు బయో వ్యర్థాలు, హాస్పిటల్ వ్యర్థాలను మరియు ఎక్స్ రే ఫిల్ములను అన్ని వ్యర్థాలతో పాటు కలిపి ఇవ్వరాదని, వాటిని ప్రత్యేకంగా వేరు చేసి మాత్రమె నగర పాలక సంస్థ పారిశుధ్య కార్మికులకు అందజేయాలని సియం ఓహెచ్ డాక్టర్ శాంతి కళ తెలిపారు. సోమవారం నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ ఆదేశాల మేరకు నగరంలోని హాస్పిటల్స్ అండ్ డయోగ్నిష్టిక్ సెంటర్ల నిర్వాహకులతో కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశం నందు సియంఒహెచ్ మాట్లాడుతూ, ఆసుపత్రుల నుంచి నగర పాలక సంస్థకు అందజేసే వ్యర్థాలలో రేడియో యాక్టివ్ వ్యర్థాలు కలవకుండా, కేవలం సాధారణ వ్యర్థాలను మాత్రమే అందజేయాలని తెలియచేశారు. రేడియో యాక్టివ్ వ్యర్థాలు సాధారణ చెత్తలో కలిస్తే పారిశుధ్య కార్మికులు, ప్రజలు మరియు పర్యావరణానికి తీవ్ర ప్రమాదం కలిగే అవకాశం ఉందని తెలియజేశారు.

రేడియో యాక్టివ్ వ్యర్థాలకు కొన్ని సాధారణ ఉదాహరణలను
ఎక్స్ రే, సి.టి స్కానులు మరియు యంఆర్ఐ ఫిల్ములు
ఉపయోగించని లేదా మిగిలిపోయిన రేడియో యాక్టివ్ మందులు
-- ఉదా: అయోడిన్-131, టెక్నీషియం-99ఎ, ఫ్లోరిన్-18.
రేడియో న్యూక్లైడ్లతో కలుషితమైన సిరంజీలు, గ్లౌజులు మరియు దూది.రోగుల విసర్జకాలు (మూత్రం, వాంతి మొదలైనవి) -- కొన్ని న్యూక్లియర్ మెడిసిన్ చికిత్సల తర్వాత వెలువడేవి.
కలుషితమైన పరుపు వస్త్రాలు, దుస్తులు లేదా శోషక పదార్థాలు.
రేడియోథెరపీ ప్రక్రియలలో ఉపయోగించే రేడియో యాక్టివ్ సోర్సెస్. ఇటువంటి వ్యర్థాలను ఉత్పత్తి అయ్యే చోటే (Point of Generation) వేరు చేయాలని, రేడియో యాక్టివ్ పదార్థాలను సాధారణ వ్యర్థాలతో ఎట్టి పరిస్థితుల్లోనూ కలపరాదని, సంబంధిత నిబంధనల ప్రకారం సురక్షితంగా అందజేయాలని, ఆసుపత్రుల యాజమాన్యాలు ఈ సూచనలను తప్పనిసరిగా పాటించి, నగర పరిశుభ్రత మరియు ప్రజారోగ్య పరిరక్షణకు సహకరించాలని కోరడమైనది.సమావేశంలో యం.హెచ్.ఓ డాక్టర్ సురేష్, శానిటరీ సూపర్వైజర్లు, సిబ్బంది మరియు నగరంలోని వివిధ ఆసుపత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు.

# దళిత బాలుడిపై దాడి: అట్రాసిటీ కేసు పెట్టాలని మార్టూరులో ధర్నా

**గుంటూరు, రాజధాని వాయిస్ :** మార్టూరు రామ్‌నగర్ కాలనీకి చెందిన 12 ఏళ్ల దళిత బాలుడు బొల్లాపల్లి అభిషేక్పై దాడి చేసిన ఘటనలో బాధ్యుడిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దళిత, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.అభిషేక్ 8వ తరగతి చదువుతున్న మైనర్ బాలుడు. ఈ నెల 10న పాఠశాలకు వెళ్తున్న సమయంలో ఒక ఇంటిపై రాయి పడిన ఘటనను కారణంగా చూపుతూ దొడ్డా హరినాథ్ బాలుడిని పట్టుకుని దాడి చేసి కొట్టినట్లు బాధిత కుటుంబం ఆరోపించింది. ఈ ఘటనలో గాయపడిన బాలుడికి ఆసుపత్రిలో చికిత్స అందించారు. అదే రోజు బాలుడి తండ్రి బొల్లాపల్లి పౌలు మార్టూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ, 18 రోజులు గడిచినా తగిన చర్యలు తీసుకోలేదని బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది.ఈ నేపథ్యంలో బాధిత కుటుంబ సభ్యులు, దళిత మరియు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మార్టూరు ప్రధాన కూడలిలో ధర్నా నిర్వహిం చారు. బాలుడిపై జరిగిన దాడిపై సమగ్ర విచారణ జరిపి, ఫిర్యాదులోని ఆరోపణల ఆధారంగా వర్తించే చట్టాల ప్రకారం ఎస్సీ, ఎస్టీ (అత్యాచార నిరోధక) చట్టం కింద కేసు నమోదు చేసి, బాధ్యుడిపై వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.అలాగే బాధిత బాలుడికి, కుటుంబానికి రక్షణ కల్పించి, చట్టప్రకారం అందాల్సిన సహాయం, పరిహారం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. మైనర్ బాలుడిపై జరిగిన ఘటనలో నిర్లక్ష్యం లేకుండా అధికారులు తక్షణమే స్పందించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.ధర్నాలో పాల్గొన్న వారు ఈ కార్యక్రమంలో వై. వెంకటేశ్వర్లు, పీడీఎం రాష్ట్ర నాయకులు; ఎస్.కె. సర్దార్, పీడీఎం ఉమ్మడి ప్రకాశం జిల్లా కన్వీనర్; వినుకొండ పేరయ్య, పౌర హక్కుల సంఘం సంయుక్త అధ్యక్షుడు; శిఖనం చిన్న, పౌర హక్కుల సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా సంయుక్త కార్యదర్శి; బొల్లాపల్లి బెన్నిబాబు, అంబేద్కర్ యూత్ ఫోర్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు; సల్లూరి రాజశేఖర్, అంబేద్కర్ యూత్ ఫోర్స్ బాపట్ల జిల్లా కార్యదర్శి; సవరపు రాజేష్, అంబేద్కర్ యూత్ ఫోర్స్ పర్చూరు నియోజకవర్గ కన్వీనర్; బాధిత బాలుడి తల్లిదండ్రులు బొల్లాపల్లి పౌలు, బొల్లాపల్లి బుజ్జి; రత్నకుమారి, విజయ్ కుమార్, కొరివి ఝాన్సీ పాల్గొన్నారు.

# ఆసుపత్రుల్లో ప్రసవాలు పెరగాలి: గుంటూరు కలెక్టర్



**గుంటూరు, రాజధాని వాయిస్ :** వివిధ శాఖల ప్రగతిపై సోమవారం కలెక్టర్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రగతి పథంలో ఉండుటకు ప్రతి శాఖ కృషి చేయాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ పనితీరు మెరుగు పడాలని స్పష్టం చేశారు. అసంక్రమిత వ్యాధుల సర్వే ప్రతీ గ్రామంలో పూర్తి స్థాయిలో జరగాలని ఆదేశించారు.ఆసుపత్రుల్లో ప్రసవాలు పెరగాలని ఆదేశించారు. సిజేరియన్ ప్రసవాలు తగ్గాలని అన్నారు. మాతాశిశు మరణాల నివారణ ధ్యేయంగా పనిచేయాలని ఆదేశించారు. పాఠశాలల్లో త్రీ స్టార్ రేటింగ్ పెరగాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. అన్ని పాఠశాలలు కనీసం రెండు, మూడు స్టార్ లలో ఉండాలని అన్నారు. వసతి గృహాల నిర్వహణ పట్ల శ్రద్ధ వహించాలని ఆదేశించారు.నైపుణ్య అభివృద్ధి కార్యక్రమం క్రింద యువతను నమోదు చేయాలని పేర్కొన్నారు. వారం రోజుల్లో నమోదు శాతం పెరగాలని స్పష్టం చేశారు. డి.డి.యు - జి.కె.వై నమోదులో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమం ద్వారా మంచి గ్రామీణ యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగ కల్పన జరుగుతుందని తెలిపారు. కనీసం 20 వేల మందిని నమోదు చేయాలని పేర్కొన్నారు. అంగన్వాడీలో పోషణ ట్రాకర్ మెరుగు పరచాలని చెప్పారు. ఇ - పంట నమోదు మూడు రోజుల్లో మెరుగుపడాలని ఆదేశించారు. నగర పాలక సంస్థ పరిధిలో కాలువల నుండి తొలగిస్తున్న వ్యర్థాలు తక్షణమే తరలించే ఏర్పాటు చేయాలని సూచించారు.తాగునీటి సరఫరా, విద్యుత్ దీపాలు, పారిశుధ్యంలో పూర్తి స్థాయిలో పనిచేయాలని అన్నారు. స్వచ్ఛత హి సేవలో నగర పాలక సంస్థలు, పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీలు బహుమతులు పొందే స్థాయిలో ఉండాలని సూచించారు. అన్నా క్యాంటీన్ ల నిర్వహణపై దృష్టి సారించాలని, సమయానికి తెరుచుకోవడంతో పాటు సిబ్బంది ప్రవర్తన తదితర అంశాలను పర్యవేక్షించాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం తాగు నీటి సరఫరాలో లోపాలు లేకుండా నిర్వహించాలని సూచించారు. పల్లె పండగ 3.0 లో పశు శాలలు నిర్మాణానికి లక్ష్యాలు నిర్దేశించడం జరిగిందని చెప్పారు. వాటికి తక్షణం మంజూరు చేసి, లక్ష్యాలుసాధించాలని స్పష్టం చేశారు. జలధార - జలహారతి కార్యక్రమం రెండవ దశలో జిల్లాలో 287 పనులు మంజూరు చేయగా ఇప్పటి వరకు 236 పనులు ప్రారంభం అయ్యాయని, మిగిలిన పనులు రెండు రోజులలో ప్రారంభం కావాలని అన్నారు. సి.సి రహదారులు, గ్రావెల్ రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు. అక్షర ఆంధ్ర - ఉల్లాస్ కార్యక్రమంలో అందరూ హాజరు అయ్యేటట్లు చూడాలని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)లో వచ్చిన అర్జీలను వెంటనే పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఎస్.ఐ.ఆర్ లో పెండింగ్ లో ఉన్న 19 నోటీస్ లపై తక్షణం విచారణ చేసి మంగళవారం నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటరు జాబితాకు సంబంధించి ఫోటోలు సరిపోయినదీ లేనిది, వాటి నాణ్యత ఈ నెల 30 నాటికి పూర్తి చేయాలని అన్నారు. జిల్లాలో ఇంకా 682 పెండింగ్ లో ఉన్నాయని చెప్పారు. ఇ.ఆర్.ఓ లు దృష్టి సారించాలని ఆదేశించారు.

**ఎన్నికల పనులు పూర్తి చేసి సిద్ధంగా ఉండాలి**

స్థానిక సంస్థల ఎన్నికల పనులు పూర్తి చేసి సిద్ధంగా ఉండాలన్నారు. ఎన్నికల సంఘం మార్గనిర్దేశకాలు, నిబంధనలుపై స్పష్టమైన అవగాహన ఉండాలని ఆదేశించారు.

ఎం.ఎల్.సి ఓటరు నమోదుకు నోటీస్ జారీ

జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి మాట్లాడుతూ పూర్వ కృష్ణ - గుంటూరు జిల్లాల ఉపాధ్యాయ ఎం.ఎల్.సి ఓటరు నమోదుకు నోటీస్ జారీ చేయడం జరిగిందని చెప్పారు.
అన్ని ఎ.ఇ.ఆర్.ఓ కార్యాలయాల్లో నోటీస్ బోర్డులో పెట్టాలన్నారు. ఉపాధ్యాయులు ఓటరుగా నమోదు కావడానికి ఉన్నత పాఠశాల లేదా అంత కంటే పై స్థాయిలో 3 సంవత్సరాలు ఉపాధ్యాయులుగా పని చేసిన అనుభవం ఉండాలన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ముఖ్య ప్రణాళిక అధికారి పి.శేష శ్రీ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, వయోజన విద్యా శాఖ ఉప సంచాలకులు ఆంజనేయులు, జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ, జిల్లా ఎస్.జి.ఎస్.డబ్ల్యు అధికారి ఆర్.రామలింగేశ్వర రెడ్డి, ఎస్.జి.ఎస్.డబ్ల్యు సమన్వయ అధికారి మోహన్ రెడ్డి, జిల్లా ఉపాధి అధికారి ఎం.క్రిస్టీ అభినవ్ తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరు కలెక్టర్‌ను కలిసి తెనాలి తహశీల్దార్‌పై నిరాధార ఆరోపణలపై వినతి



**గుంటూరు, రాజధాని వాయిస్ :** సమాచార హక్కు చట్టం పేరుతో తెనాలి తహసీల్దార్ గోపాలకృష్ణపై నిరాధారమైన ఆరోపణ లతో సోషల్ మీడియా పత్రికా ముఖంగా బెదిరింపులకు పాల్పడ టం వంటి అంశాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లాలోని తహసీల్దార్లు కలెక్టర్ సాయికాంత్ వర్మను కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్లోని కలెక్టర్ ను కలిశారు .ప్రభుత్వ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడం సమాచార హక్కు చట్టం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. తెనాలి తహశీల్దార్ గోపాలకృష్ణపై, అలాగే ఇతర ప్రభుత్వ శాఖల అధికారులపై తెనాలి మండలం కొలకలూరు గ్రామానికి చెందిన కాలిశెట్టి ఫణికుమార్, తెనాలి పట్టణానికి చెందిన కామేశ్వరరావు అనే వ్యక్తులు పత్రికలు, సోషల్ మీడియా వేదికల ద్వారా పలు ఆరోపణలు చేస్తున్నారని వివరించారు.తహశీల్దార్ లంచం డిమాండ్ చేశారని, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ విషయంలో అక్రమాలకు పాల్పడ్డారని వారు ఆరోపిస్తున్నారన్నారు. ఈ ఆరోపణలకు సంబంధించి నిజానిజాలను సంబంధిత దర్యాప్తు సంస్థలు, అధికారులు చట్ట ప్రకారం నిర్ధారించాలని, ఆధారాలు లేకుండా ఆరోపణలు చేసి ప్రభుత్వ ఉద్యోగులపై ఒత్తిడి తీసుకురావడం, బెదిరింపులకు పాల్పడడం సమర్థనీయం కాదని తెలిపారు.రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా ఎంతో చిత్తశుద్ధితో, నిబద్ధతతో అంకితభావంతో ఉన్న తెనాలి తహసీల్దార్ వారి కార్యాలయాన్ని మోడల్ గా తీర్చిదిద్దటంలో గోపాలకృష్ణ పాత్ర ప్రశంసనీయమని చెప్పారు. దీనిపై స్వయానా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు అభినందనలు తెలపడం గర్వకారణం అన్నారు.దాతల సహకారంతో తహసిల్దార్ కార్యాలయాన్ని ఆధునికంగా తీర్చిదిద్దినప్పటికీ ఈ విషయంలోనూ నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు.సదరు వ్యక్తులు గతంలో కూడా ఇదే విధమైన రీతిలో ఒక వైద్యురాలు, దేవాదాయశాఖతో పాటు ఇతర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులను లక్ష్యంగా చేసుకుని వేధింపులకు పాల్పడిన సందర్భాలు ఉన్నాయని చెప్పారు. ఈ అంశాలపై పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయగా, సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేశారన్నారు. కేసు నమోదైన తర్వాత కూడా ఇప్పటివరకు తదుపరి చర్యలు కనిపించకపోవడంతో, నిజాయితీగా విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల్లో ఆందోళన నెలకొందన్నారు.ప్రభుత్వ ఉద్యోగులు తప్పు చేస్తే వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసే అవకాశం ఉందని, కానీ బెదిరింపులకు పాల్పడే అంశాలు సరైనవి కాదని చెప్పారు. నిరాధారమైన ఆరోపణల కారణంగా ప్రభుత్వ ఉద్యోగుల్లో మరో ధైర్యం దెబ్బతింటుందని వివరించారు. వెంటనే సంబంధిత అంశంపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. విధి నిర్వహణలో ఉన్న తహశీల్దార్‌తోపాటు రెవెన్యూ శాఖ ఉద్యోగులకు తగిన భద్రత, రక్షణ కల్పించాలని కోరుతున్నామన్నారు.ఇది కేవలం ఒక అధికారి లేదా ఒక వ్యక్తికి సంబంధించిన సమస్యగా కాకుండా, ప్రభుత్వ ఉద్యోగులు ఎటువంటి భయాందోళనలు లేకుండా తమ విధులను నిర్వహించేలా చూడాలని అలాగే ఇలాంటి చర్యలకు పునరావితం కాకుండా చర్యలకు పాల్పడిన వ్యక్తులను వెంటనే శిక్షించాలని ఉద్యోగులు కోరుకుంటున్నారు.సమాచార హక్కు చట్టాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని, అదే సమయంలో ఆ చట్టాన్ని ఉపయోగించే హక్కుతోపాటు, ఇతరుల హక్కులు, ప్రతిష్ట, చట్టపరమైన రక్షణలను కూడా గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కాబట్టి చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా, చట్టబద్ధమైన మార్గాల్లోనే సమస్యలను పరిష్కరించుకోవాలని అందరికీ విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.ఏపీఆర్ఎస్ఏ అసోసియేషన్ వినతి మేరకు వెంటనే స్పందించిన కలెక్టర్, సంబంధిత విషయంపై ఎస్పీతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని ఏపీఆర్ఎస్ఏ అసోసియేషన్ నాయకులకు తెలియజేశారు.

# పల్లె పండుగ 3.0: పెదనందిపాడులో 13 పనులకు ఎమ్మెల్యే శ్రీకారం



**గుంటూరు, రాజధాని వాయిస్ :**పల్లె పండుగ 3.0 -- VB-GRAMG పథకం కింద పెదనందిపాడు మండల పరిధిలోని వివిధ గ్రామాలకు మంజూరైన రూ.1.52 కోట్లతో చేపట్టనున్న మొత్తం 13 అభివృద్ధి పనులకు పెదనందిపాడు మండల కేంద్రంలో శంకుస్థాపన చేసిన గౌరవ ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు డా. బూర్ల రామాంజనేయులు ఈ సందర్భంగా శాసనసభ్యులు వారు మాట్లాడుతూ గత పాలనలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి పట్ల చూపిన నిర్లక్ష్యంతో అనేక మౌలిక వసతుల సమస్యలు పేరుకు పోయాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, నిధులు సమకూర్చి, పనులను కార్యరూపంలోకి తీసుకువస్తోందని,ప్రజల వద్దకే పాలన, ప్రజల చెంతకే అభివృద్ధి,ప్రతి పల్లెకు ప్రగతి, ప్రతి కుటుంబానికి మెరుగైన సౌకర్యాలు అనే లక్ష్యంతో పెదనందిపాడు మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గ తెదేపా పరిశీలకురాలు ఆచంట సునీత, ప్రత్తిపాడు నియోజకవర్గ జనసేన పార్టీ కొర్రపాటి నాగేశ్వరరావు, రాష్ట్ర రైతు మీడియ కోఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు మండల పార్టీ అధ్యక్షులు కోడూరి రాంబాబు, మండల పరిధిలోని వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు, మాజీ సర్పంచ్లు మరియు పాల్గొన్నారు.

# సాగునీరు కష్టతరమే

**ఆయు కట్టు రైతుల్లో నిరుత్సాహం**
**ఆరుతడి పంటలపై దృష్టి**
**అడుగంటి పోతున్న బోర్లు**

**కారంపూడి.సెప్టెంబర్ 28,రాజధాని వాయిస్ :** రైతులు ఎంతో ఆశతో సాగునీరు విడుదల చేస్తారని ఎదురు చూశారు. ఎల్ నినో ఈ ఏడాది పంటలపై తీవ్ర ప్రభావం చూపనుంది. నాగార్జునసాగర్ కుడి కాలువ ఆయకట్టులో సుమారు ఆరు లక్షల ఎకరాల సాగుభూమి ఉంది. సాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 532 అడుగుల నీరు మాత్రమే ఉంది. ఎగువ నుండి నీరు రాకపోవటం సరైన వర్షాలు లేకపోవడంతో సాగునీటి రైతుల ఆందోళన మొదలైంది. ఆయకట్టులో పల్నాడు, బాపట్ల, గుంటూరు, ప్రకాశం, మార్కాపురం జిల్లాల రైతులు నిరుత్సాహంతో ఉన్నారు. గత ఏడాది పుష్కలంగా సాగునీరు రావడంతో రెండు పంటలు సాగుచేసిన రైతులు సెప్టెంబర్ మాసం ముగుస్తున్న కుడి కాలువ ద్వారా నీరు రాకపోవటంతో సన్నద్ధంలో పడ్డారు. ఆగస్టు 26వ తేదీన త్రాగునీటి అవసరాల కోసం జలవనరుల శాఖ అధికారులు 8టీఎంసీల నీటిని విడుదల చేశారు. ఆయకట్టులోని చెరువులు, కుంటలు నీటితో నింపారు. సకాలంలో వర్షాలు పడతాయన్న ఆశతో రైతులు ఈ ఏడాది భూములను ముందుగానే సేద్యం చేశారు. మండలంలోని గ్రామాలలో బోర్ల కింద వరి నాళ్ళు సిద్ధం చేసుకున్నారు. కారంపూడి మండలంలో 10 వేల హెక్టార్ల సాగు భూమి ఉండగా 2300 హెక్టార్లలో పత్తి పంటను సాగు చేశారు.1000 హెక్టార్లలో మిర్చి పంటను ప్రస్తుతం సాగు చేయగా బుడ్డ సెనగ,కంది పంటలు సాగు చేయటానికి రైతులు మొగ్గు చూపుతున్నారు. 70 శాతం వరి పంటలు, మొక్కజొన్న తగ్గే అవకాశం ఉంది. రైతులు పంటలు సాగు చేసేందుకు బోర్లపై ఆదరపడ్డారు .ఎల్ నినో ప్రభావంతో నియోజకవర్గంలో సగటున 29శాతానికి లోపే వర్షపాతం నమోదయింది. బోర్ల నుండి




కూడా నీరు అందదనే సందేహం వ్యక్తమౌతుంది .

**కౌలు రైతు పరిస్థితి దయనీయం**

వర్షాలు పడకపోవడం, పంటల సాగు చేయలేని పరిస్థితులు కౌలు రైతుల్లో నెలకొంది. ముందస్తుగా కౌలు చెల్లించిన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు . పంటలు సాగు చేయకపోతే చెల్లించిన కౌలు మొత్తం నష్టపోయే పరిస్థితి ఏర్పడింది.

**కంది సాగుపై రైతుల ఆశలు**

ఏడాది సాగునీరు లేకపోవటంతో మండలంలో కంది పంట సాగుపై రైతుల ఆశలు ఎక్కువగా ఉన్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి పొట్ల. నరసింహారావు తెలిపారు.సాగునీరు లేకపోవటంతో వరి, మొక్కజొన్న పంటలు సాగు చేయలేదని ఆ పంటలకు సాగునీరు అవసరమని అన్నారు. కొన్ని గ్రామాలలో బుడ్డ సెనగ సాగుకు రైతులు మోగ్గు చూపుతున్నారని అన్నారు.

ఎగువ నుండి నీరు వస్తే సాగునీరు అందిస్తాం
జల వనరుల శాఖ
ఏఈ : రామయ్య

ఎల్ నినో ప్రభావంతో సరైన వర్షాలు లేవని, ఎగువ నుండి సాగర్ జలాశయానికి నీరు వస్తే కుడి కాలువ ద్వారా సాగునీరు అందిస్తామని ఆయన తెలిపారు. జలాశయంలో నీటిమట్టం కూడా గరిష్టంగా తగ్గిందని అన్నారు.

# మాచర్ల చైర్మన్ పీఠం... ఎస్సీలకు ఎప్పుడు?

**నాలుగు దశాబ్దాలుగా ఎదురుచూపులేనా..?**
**మాల, మాదిగల ఓట్లు గణనీయంగా ఉన్నాయంటున్న స్థానికులు**
**జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలని వినతి**

**మాచర్ల.సెప్టెంబర్ 28 రాజధాని వాయిస్ :** మాచర్ల మున్సిపాలిటీ ఏర్పాటై నాలుగు దశాబ్దాలు గడుస్తున్నా, మున్సిపల్ చైర్మన్ పదవిలో ఎస్సీ వర్గాలకు తగిన ప్రాతినిధ్యం దక్కలేదనే భావన స్థానికంగా వ్యక్తమవుతోంది. మున్సిపాలిటీ ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు చైర్మన్ పదవికి అమలైన రిజర్వేషన్ రొటేషన్ వివరాలను సంబంధిత అధికారులు పారదర్శకంగా ప్రజల ముందుంచాలని ఎస్సీ వర్గాల ప్రతినిధులు కోరుతున్నారు.
స్థానికుల అభిప్రాయం ప్రకారం మాచర్ల పట్టణంలో మాల, మాదిగ సామాజిక వర్గాలకు చెందిన ఓటర్లు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. ఎన్నికల సమయంలో ఈ వర్గాలు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, పదవుల కేటాయింపులో మాత్రం తమకు సముచిత ప్రాతినిధ్యం దక్కడం లేదని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**జనాభా దామాషా ప్రకారమే అవకాశం. ఎస్సీ వర్గాల డిమాండ్**

మున్సిపల్ చైర్మన్ పదవుల రిజర్వేషన్ కేటాయింపులో జనాభా ప్రాతిపదికన, చట్టపరమైన నిబంధనలు మరియు రిజర్వేషన్ రొటేషన్ విధానాన్ని అనుసరించాలని ఎస్సీ వర్గాలు విజ్ఞప్తి చేస్తున్నాయి. ఎన్నికల్లో తమ ఓట్లు కీలకంగా ఉన్నప్పుడు, పదవుల విషయానికి వచ్చేసరికి ఎందుకు ప్రాధాన్యం దక్కడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఎస్సీ వర్గాలకు చైర్మన్ పీఠం దక్కేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**రిజర్వేషన్ రొటేషన్ వివరాలు వెల్లడించాలి**
**స్థానికుల విజ్ఞప్తి**

గతంలో అమలైన రిజర్వేషన్ కేటగిరీలు, రొటేషన్ క్రమం, అలాగే భవిష్యత్తులో వర్తించే విధానంపై అధికారులు పూర్తి స్పష్టతనివ్వాలని ప్రజలు కోరుతున్నారు. రాజ్యాంగబద్ధమైన హక్కుల ప్రకారం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల ప్రక్రియ సక్రమంగా కొనసాగాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**ప్రశ్న ఒక్కటే.. చైర్మన్ పీఠం దక్కేది ఎప్పుడు?**

పట్టణ జనాభాలో, ఓటర్లలో ఎస్సీ వర్గాలు ప్రధాన భాగంగా ఉన్న నేపథ్యంలో, మాచర్ల మున్సిపల్ చైర్మన్ పదవికి ఎస్సీ రిజర్వేషన్ ఎప్పుడు ఖరారవుతుందనే అంశంపై స్పష్టత ఇవ్వాలని సంబంధిత వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

# గుర్రం జాషువాకు ఘన నివాళి

**గుంటూరు.సెప్టెంబరు 28 రాజధాని వాయిస్ :** నవయుగ కవి చక్రవర్తి, విశ్వకవి సమ్రాట్ గుఱ్ఱం జాషువ జయంతి సందర్భంగా గుంటూరు పట్టణం నందు ఆనందపేటలోని సుద్దపల్లి డొంక లూథరన్ సమాధుల తోటలో గల వారి స్మారక జ్ఞాపిక (సమాధి) వద్ద అనిల్ కుమార్ దారివేముల, లింగాల అజయ్ కుమార్, నర్రావుల వీరబ్రహ్మం, మార్టూరి అజయ్ కుమార్ పాల్గొని అంజలి ఘటించారు. సామాజిక అసమానతలను వ్యతిరేకిస్తూ, కులరహిత సమాజం కొరకు అక్షర పోరాటం చేసి, సమాజానికి సాహితీ చైతన్య వెలుగులు పంచి, శిశువు మొదలుకొని స్మశానం వరకు అనేక అంశాలను కవిత వస్తువులుగా చేసుకుని, అనేక ప్రక్రియలలో సాహిత్య సృష్టి చేశారని, ఆధునికాంధ్ర సాహిత్యంలో



అను నిత్యం ప్రజల నాలుకల మీద జీవిస్తున్న విశిష్టకవి గుర్రం జాషువా అని కవి, రచయిత అనిల్ కుమార్ దారివేముల కొనియాడారు. సాహిత్య అభిమానులు పుష్పాంజలి ఘటించారు.

# దీక్షాంత్ పరేడ్ విజయవంతంగా నిర్వహించాలి: ఎస్పీ మహేశ్వర రెడ్డి

**శ్రీకాకుళం, రాజధాని వాయిస్ :** తండేవలస జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో ప్రాథమిక శిక్షణ పూర్తి చేసుకున్న 142 మంది శిక్షణార్థి పోలీసు కానిస్టేబుళ్ల దీక్షాంత్ పరేడ్‌ను అత్యంత క్రమశిక్షణ తో, సమన్వయంతో నిర్వహించాలని జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి సూచించారు. సెప్టెంబర్ 29న జరగనున్న పాసింగ్ అవుట్ పరేడ్‌కు సంబంధించిన ఏర్పాట్లను ఆయన సోమవారం క్షేత్రస్థాయి లో పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణ కేంద్రానికి చేరుకున్న ఎస్పీకి శిక్షణార్థులు గౌరవ వందనం సమర్పించగా, అనంతరం ఆయన పరేడ్ రిహార్సల్స్‌ను పరిశీలించారు. పరేడ్‌లో పాల్గొంటున్న శిక్షణార్థుల కవాతు, డ్రిల్, మార్చ్‌పాస్ట్, కమాండింగ్, గౌరవ వందనం, అడుగుల సమన్వయం, వరుసల నిర్వహణ తదితర అంశాలను ఎస్పీ నిశితంగా పరిశీలించారు. పరేడ్‌లో ప్రతి అడుగు క్రమశిక్షణకు ప్రతీకగా ఉండాలని, శిక్షణ కాలంలో నేర్చుకున్న నైపుణ్యాలు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శన ఉండాలని సూచించారు. ఏకరూపత, ఆత్మవిశ్వాసం, అంకితభావం ప్రతిబింబించేలా తుది రిహార్సల్స్ నిర్వహించాలని ఆదేశించారు.దీక్షాంత్ పరేడ్ పోలీసు శిక్షణలో ఒక ముఖ్యమైన ఘట్టమని, దీనిని ప్రతి శిక్షణార్థి గర్వంగా గుర్తుంచుకునేలా నిర్వహించాలని ఎస్పీ పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకుని పోలీసు సేవలోకి అడుగుపెడుతున్న కానిస్టేబుళ్లు ప్రజలకు ఆదర్శంగా నిలిచే విధంగా విధులు నిర్వహించాలని సూచించారు.

క్రమశిక్షణ, నిబద్ధత, సేవా దృక్పథం పోలీసు వ్యవస్థకు మూలస్తంభాలని గుర్తుచేశారు. అనంతరం పరేడ్ మైదానం, ప్రధాన వేదిక, ముఖ్య అతిథుల రాకపోకల ఏర్పాట్లు, వీఐపీ సీటింగ్, ఆహ్వానితుల కూర్చునే ప్రదేశాలు, విద్యుత్ సదుపాయాలు, ధ్వని వ్యవస్థ, వాహనాల నిలిపే ప్రదేశాలు, భద్రతా ఏర్పాట్లను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమ నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.ముఖ్య అతిథులు, ఉన్నతాధికారులు, శిక్షణార్థుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ సదుపాయాలు, భద్రతా చర్యలు, సీటింగ్ ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమం మొత్తం సమయపాలనతో, క్రమశిక్షణతో నిర్వహించేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యం: హోంమంత్రి అనిత

**విజయనగరం, రాజధాని వాయిస్ :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని రాష్ట్ర హోంమంత్రి అనిత తెలిపారు. విజయనగరం జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని ఎన్నికల సన్నాహకాలపై దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేస్తూ ప్రతి స్థాయిలో పటిష్టమైన కార్యాచరణతో ఎన్నికలకు సిద్ధం కావాలని సూచించారు. సమావేశంలో కూటమి భాగస్వామ్య పార్టీల మధ్య ఐక్యత, సమన్వయం మరింత బలోపేతం కావాల్సిన అవసరాన్ని హోంమంత్రి ప్రస్తావించారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో నాయకులు, కార్యకర్తలు పరస్పర సహకారంతో పనిచేస్తే ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు సాధించవచ్చని అన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వారికి చేరువ కావాలని సూచించారు.స్థానిక సంస్థల ఎన్నికలు అభివృద్ధి కార్యక్రమాల కొనసాగింపుకు కీలకమని హోంమంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో క్రమశిక్షణ, సమన్వయం అత్యంత ముఖ్యమని చెప్పారు. విజయనగరం జిల్లాలో కూటమి బలాన్ని మరింత పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు అనిత తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో పరిస్థితులను సమీక్షిస్తూ ఎన్నికల వ్యూహాలను అమలు చేయాలని



నాయకులకు సూచించారు. ప్రజల విశ్వాసాన్ని పొందేందుకు సేవా కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని అన్నారు.కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు వ్యక్తిగత విభేదాలకు తావివ్వకుండా సమష్టి లక్ష్యంతో ముందుకు సాగాలని హోంమంత్రి సూచించారు. ఎన్నికల ప్రచార కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి కూటమి అభ్యర్థులను విజయపథంలో నడిపించాలని కోరారు. ఐక్యతే విజయానికి ప్రధాన బలమని పేర్కొన్నారు. విజయనగరం జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి జెండా ఎగరేయాలన్న సంకల్పంతో అన్ని స్థాయిల్లో నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని హోంమంత్రి అనిత పిలుపునిచ్చారు. కూటమి అభ్యర్థుల విజయమే అందరి లక్ష్యమని, అందుకు అనుగుణంగా కార్యాచరణ కొనసాగించాలని స్పష్టం చేశారు.

# గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం

**టెక్కలి, రాజధాని వాయిస్ :** గిరిజన ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. టెక్కలి నియోజకవర్గ పరిధిలోని ప్రతి గిరిజన ఆవాసానికి మెరుగైన సీసీ, బీటీ రహదారులు, డ్రైనేజీ తదితర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చేపడుతున్న పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో ఐటీడీఏ, ఇంజినీరింగ్ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ఈ మేరకు సూచనలు చేశారు. గతంలో సరైన మౌలిక వసతుల లేమితో గిరిజన ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని మంత్రి పేర్కొన్నారు. ఆ సమస్యలను పూర్తిగా తొలగిస్తూ నియోజకవర్గంలోని ప్రతి గిరిజన గ్రామానికి అన్ని కాలాల్లో రాకపోకలు సాగించే అనుసంధాన రహదారి సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఇప్పటికే మంజూరై వివిధ దశల్లో నిలిచిపోయిన రహదారి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సమావేశంలో ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో కొత్త రహదారుల నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. లక్ష్మీపురం జంక్షన్ నుంచి కందులగూడెం వరకు, నువ్వగాం నుంచి మదనాపురం--బర్తుపురం వరకు, ఎం.ఎన్. రోడ్డు నుంచి చిన్ని లక్ష్మీపురం వరకు రహదారి అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని తెలిపారు.టెక్కలి మండలం జీడిపేట వద్ద ఉన్న వాగు కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కూడా మంత్రి ప్రస్తావించారు. సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి అక్కడ కల్వర్టు నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం



చేయాలని ఆదేశించారు. శాశ్వత పరిష్కారం కోసం తగిన నిధులను సమీకరించి పనులు చేపట్టాలని సూచించారు. టెక్కలిలో నిర్మాణంలో ఉన్న గిరిజన విద్యార్థుల ట్విన్ హాస్టల్ భవన పనుల పురోగతిని కూడా మంత్రి సమీక్షించారు. పనులను వేగవంతం చేసి భవనాన్ని త్వరలోనే పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు స్పష్టం చేశారు. విద్యార్థులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్య అంశమని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కార చర్యలు చేపడతామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ గిరిజన ప్రాంతాల అభివృద్ధికి అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసి గిరిజన ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలని దిశానిర్దేశం చేశారు.

# మహాకవి జాషువాకు ఘన నివాళి

**అమరావతి, రాజధాని వాయిస్ :** ప్రముఖ సాహితీవేత్త, మహాకవి గుర్రం జాషువా జయంతి సందర్భంగా తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి మంత్రి కొల్లు రవీంద్ర పుష్పాంజలి ఘటించారు. తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న జాషువా సమాజంలో నెలకొన్న మూఢాచారాలు, అంటరానితనం, వివక్షతలపై తన రచనల ద్వారా పోరాడిన గొప్ప కవిగా నిలిచారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. జాషువా సాహిత్యం కేవలం కవిత్వానికి మాత్రమే పరిమితం కాకుండా సామాజిక చైతన్యానికి మార్గదర్శకంగా నిలిచిందని మంత్రి అన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాల ఆవేదనలను తన కలంతో ప్రతిబింబిస్తూ సమానత్వ భావనను విస్తృతంగా ప్రచారం చేశారని కొనియాడారు. ఆయన రచనలు నేటికీ ప్రజలకు స్ఫూర్తినిస్తున్నాయని తెలిపారు.తెలుగు భాషా సాహిత్య సంపదను మరింత సమృద్ధిగా చేసిన రచయితల్లో జాషువా అగ్రగణ్యుడని మంత్రి పేర్కొన్నారు. సమాజంలోని అసమానతలను ప్రశ్నిస్తూ, మానవతా విలువలను ప్రతిష్ఠించిన రచనలు ఆయనకు చిరస్థాయి గుర్తింపును తీసుకువచ్చాయని అన్నారు. ఆయన సాహిత్యం తరతరాలకు మార్గనిర్దేశం చేస్తోందని అభిప్రాయపడ్డారు. గబ్బిలం, ఫిరదౌసి వంటి రచనల ద్వారా జాషువా సామాజిక చైతన్యాన్ని రగిలించారని మంత్రి గుర్తుచేశారు. అణగారిన వర్గాల సమస్యలను హృదయానికి హత్తుకునేలా ఆవిష్కరించి ప్రజల్లో ఆలోచన రేకెత్తించారని



పేర్కొన్నారు. సమాజ సంస్కరణకు సాహిత్యాన్ని ఆయుధంగా మలచిన అరుదైన కవుల్లో ఆయన ఒకరని తెలిపారు.మూఢనమ్మకాలు, కుల వివక్ష, అంటరానితనం వంటి సామాజిక రుగ్మతలపై జాషువా తనదైన శైలిలో పోరాటం చేశారని మంత్రి వివరించారు. సమాన హక్కులు, మానవ గౌరవం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన సాహిత్య యజ్ఞం చిరస్మరణీయమని అన్నారు. సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడంలో ఆయన పాత్ర విశేషమని కొనియాడారు. ఈ సందర్భంగా మహాకవి గుర్రం జాషువాకు మంత్రి ఘన నివాళులు అర్పించారు. ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకుని సమానత్వ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలుగు సాహిత్య చరిత్రలో జాషువా పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

## SIR ఓటర్ల జాబితా సవరణలో కీలక పురోగతి.. 99.92శాతం నోటీసుల విచారణ పూర్తి

**అమరావతి,రాజధాని వాయిస్** సెప్టెంబర్ 28: రాష్ట్రంలో SIR ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో కీలక పురోగతి నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా జారీ చేసిన 44.28 లక్షల నోటీసుల్లో 44.25 లక్షల నోటీసులకు విచారణ పూర్తైంది. దీంతో మొత్తం 99.92 శాతం నోటీసుల విచారణ పూర్తి అయినట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం 3,629 నోటీసులు మాత్రమే విచారణకు మిగిలి ఉన్నాయి. తిరుపతి, ఎన్టీఆర్, పల్నాడు, అనంతపురం, ప్రకాశం జిల్లాల్లో మిగిలిన నోటీసుల విచారణ పెండింగ్‌లో ఉంది. తిరుపతి జిల్లాలో 2,477 నోటీసులు విచారణకు మిగిలి ఉండగా.. ఎన్టీఆర్ జిల్లాలో 486, అనంతపురంలో 257, పల్నాడులో 205, ప్రకాశంలో109 నోటీసులు విచారణకు పెండింగ్‌లో ఉన్నాయి. గుంటూరు, నెల్లూరు, నంద్యాల, ప్రకాశం, వైఎస్సార్ జిల్లాల్లో అత్యల్పంగా పెండింగ్‌లో ఉన్నాయి.ఇక, ఓటర్ల ఫొటో క్వాలిటీ చెక్‌లో 99.77 శాతం ఆమోదం పొందాయి. రాష్ట్రవ్యాప్తంగా 3.71 కోట్ల మంది ఓటర్ల ఫొటోలను బీఎల్‌ఓలు పరిశీలించగా.. 3.70 కోట్ల మంది ఓటర్ల ఫొటో క్వాలిటీకి ఆమోదం లభించింది. ఫొటో క్వాలిటీ చెక్‌లో కేవలం 0.23 శాతం పెండింగ్‌లో ఉంది. ఎన్టీఆర్, అనంతపురం, నెల్లూరు, వైఎస్సార్, తిరుపతి జిల్లాల్లో మరింత వేగం పెంచాలని అధికారులు సూచించారు. క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్‌పై ప్రత్యేక దృష్టి సారించారు.

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com